క్లుప్తంగా

శుభ్రతతోనే ఆరోగ్యం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో డాక్టర్ సింధు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పరిశరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుంతలు, కుంటల్లో నీటిని నిల్వ ఉంచరాదని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గద్వాల అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయిదు నెలలుగా వేతనాలు చెల్లించకుంటే అధ్యాపకులు కుటుంబ పోషణ ఎలా సాగించాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అతిథి అధ్యాపకులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు.

ఆందోళన



ధరూరు: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మిషన్ భగీరథ కార్మికులతో కలిసి హెడ్ వర్క్స్ జూరాల ప్రాజెక్టు జీరో పాయింట్ డ్యాం వద్ద గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. 5 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల తరబడిగా వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెల 5వ తేదీనే వేతనాలు అందించాలన్నారు. పనిచేస్తే చేయండి లేకపోతే వెళ్లిపోండి అంటూ అధికారులు మాట్లాడటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

రూ.50వేల ఆర్థికసాయం అందజేత



గద్వాల క్రైం: అనారోగ్యంతో బాధపడుతూ పట్టణానికి చెందిన గోవర్దన్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1999–2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆంజనేయులు, రాముడు, ఫారుక్, వెంకటేష్ రూ.50వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ నగదును కుమార్తె విద్య ఉన్నత చదువుల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. భవిష్యత్తులో కూడా తమ సహాయ సహకారాలు స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహానంది, వీరేష్, రవీంద్రనాయుడు ఉన్నారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

శాంతినగర్: కుక్కలు దాడి చేయడంతో 60 గొర్రె పిల్లలు మృత్యువాత పడిన ఘటన వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత జీవాల యజమానులు చిన్న మస్తాన్, పెద్ద సోమన్న తెలిపిన వివరాల ప్రకారం.. జూలెకల్ శివారులోని ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో గొర్రె పిల్లలను వలలో ఉంచి గొర్రెల మేపు కోసం వెళ్లారు. వలలో దూరిన కుక్కలు ఇద్దరికి చెందిన 60 పిల్లలను కొరికి చంపినట్లు బాధితుల వాపోయారు. ఉత్తర ఫుడ్స్ కంపెనీ వారు చనిపోయిన కోళ్లను ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో పడేయటంతో వాటి తినడానికి కుక్కలు వస్తున్నాయని, కోళ్లు లేని సమయంలో ఆహారం కోసం తరచూ గొర్రెల మందలపై దాడి చేసి చంపి తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రెండు సార్లు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, గొర్రె పిల్లలు మృతిచెందడంతో సుమారు రూ.5 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈవిషయమై కంపెనీ వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధిత గొర్రెల కాపరులు కోరారు.



ధరూర్‌లో..



బీచుపల్లిలో..



ఎర్రవల్లిలో..



గట్టులో..

జగన్మాతా.. కరుణించు తల్లీ



అయిజలో..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పాడి, పంటలు సమృద్ధిగా పండి తమ కుటుంబాలను సంతోషంగా ఉండాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలు చేశారు. దాతలు, ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం వితరణ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



షేక్‌పల్లిలో..



శాంతినగర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మానవపాడులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పథకాలతో పేదలకు సంక్షేమం

- ఎమ్మెల్యే విజయుడు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

అలంపూర్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి తోడ్పాటు అందుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరై అయిజ, రాజోళి మండలాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు రూ.1.36 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను ఆసరాగా చేసుకొని వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వావిలాల రంగారెడ్డి, సంకాపురం రాముడు, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు



చింతకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలబాలికలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఎంవీ ఫౌండేషన్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కిశోర బాలికల సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ బాలికల హక్కులకు రక్షణ ఉండాలంటే వారికి ఉన్నత విద్యను అందించి బాలురతో పాటు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామంలోని బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సభ్యులు రవిప్రకాష్ మాట్లాడుతు ఆడపిల్లలపై చిన్నచూపు చూడకుండా అబ్బాయిలతోపాటు వారికి సమాన విద్య, సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఆడపిల్లలు ఇతరుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదంటే 1098, 100 డయల్ చేస్తే సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేస్తారన్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన వెంకటేష్‌యాదవ్ చిన్నారులకు బెలూన్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ సుధాకర్, శేఖర్, గోపాల్, మధు, ఆంజనేయులు, వీఓఏ కృష్ణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బాలబాలికలను తల్లిదండ్రులు సమానంగా చూడాలని, బాల్య వివాహాలు నిర్మూలించాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలకుంటలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అక్బర్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, రఘుకుమార్‌శెట్టి, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, కిరణ్ తదితరులు ఉన్నారు.



జూలెకల్‌లో..

మాచర్లలో బాలికల ర్యాలీ

గట్టు: మండలంలోని మాచర్లలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో బాలికలు ర్యాలీ నిర్వహించారు. బాలికలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టాలని, బాలికల హక్కుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నర్సింహులు కోరారు. ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఇందువాసి గ్రామంలో బాలికల దినోత్సవం నిర్వహించి, ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, టీఎస్ఎస్, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

సోదరుడిపై దాడి: కేసు నమోదు

శాంతినగర్: ఆస్తి వివాదంలో తమ్ముడిపై అన్నలు దాడి చేసిన ఘటన వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ టాటా బాబు, హెడ్‌కానిస్టేబుల్ సుంకన్‌బాబు తెలిపిన వివరాలు ఇలా.. తనగల గ్రామానికి చెందిన హరిజన కిష్టన్నకు నలుగురు కొడుకులు. కొన్నేళ్లుగా ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గతంలో పలుమార్లు అన్నదమ్ములు గొడవలు పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు వివరించారు. శుక్రవారం ఉదయం తనగల నుంచి వెంకటాపురం స్టేజీ వైపు స్కూటీపై వెళ్తున్న తమ్ముడు మహేష్‌ను అన్నలైన రమేష్, తిమ్మప్ప, మరో గుర్తుతెలియని యువకుడు కాపుకాసి దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఘటనలో మహేష్‌కు ఒక కాలు విరగగా.. మరో కాలికి గాయమైంది. అంతేగాక తల, చేతులకు రక్తగాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు. గాయపడ్డ మహేష్‌ను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. బాధితుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తనగలను సందర్శించిన సీఐ

దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే శాంతినగర్ సీఐ టాటాబాబు హుటాహుటిన తనగలకు చేరుకున్నారు. గొడవకు దారితీసిన పరిస్థితులపై సమీపంలోని ఇళ్లవారిని, గ్రామస్థులను, బాధితుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. గతంలో కూడా ఆస్తి విషయంలో అన్నదమ్ములు కొట్టుకుని కేసులు పెట్టుకున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

టిప్పర్ పట్టివేత

గద్వాల క్రైం: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టణ పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గద్వాల మండలం అనంతపురం ప్రభుత్వ గుట్టల నుంచి బస్రాల్ చెరువు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, డ్రైవర్ రాముడు టిప్పర్ల ద్వారా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు గద్వాల–అయిజ రోడ్డు మార్గంలో టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మైనింగ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టుబడిన టిప్పర్‌ను మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నానాజీ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి

అయిజ: సంఘ సంస్కర్త నానాజీ దేశ్‌ముఖ్ జయంతి వేడుకలను శుక్రవారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నానాజీ దేశ్‌ముఖ్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. సరస్వతి శిశు మందిరాల వ్యవస్థాపకులు, గ్రామీణాభివృద్ధి సాధకులు నానాజీ దేశ్‌ముఖ్ అని కొనియాడారు. ఆయన అందించిన పవిత్ర సేవ, గ్రామీణాభివృద్ధికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యం నిరంతరం సమాజానికి ప్రేరణ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అయిజ: ఎంబీ ఉమెన్స్ వారు మండల కేంద్రంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హెప్సిబా సామ్యూల్, క్రిస్టోలైట్, దెబోరా దేవి హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థినులకు క్విజ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఆట, పాటలతో అలరించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదివి జీవితంలో లక్ష్యం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్తేర్, మేరమ్మ, రాణెమ్మ, ఎంబీ చర్చి పాస్టర్లు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.